ట్రైనీ కలెక్టర్లకు అవగాహన


పంచాయతీ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్లకు అవగాహన

ఓర్వకల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ కలెక్టర్లకు ఆదివారం మండలంలోని హుశేనాపురం పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరై మూడంచెల వ్యవస్థ పని తీరును వివరించారు. అలాగే ప్రజలకు అందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో వివిధ పథకాలపై క్లుప్తంగా ట్రైనీ కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు ట్రైనీ కలెక్టర్లు హుశేనాపురం గ్రామాన్ని సందర్శించారు.

పాలనాధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పరిపాలన అధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలకు పదోన్నతులు కల్పిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి మండలాలు కేటాయిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న పరిపాలన అధికారి పి. దస్తగిరిబాబును కొలిమిగుండ్ల ఎంపీడీఓగా, బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న పరిపాలన అధికారి ఎస్.నాగరాజును బనగానపల్లె ఎంపీడీఓగా, బండిఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న వై. రామక్రిష్ణవేణిని అవుకు ఎంపీడీఓగా, తుగ్గలి పరిపాలన అధికారి ఎస్ఎం. బాషాను కోసిగి ఎంపీడీఓగా, గోస్పాడు డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న ఎం. నాగ అనసూయను ఓర్వకల్లు ఎంపీడీవోగా ఉత్తర్వులు జారీ చేశారు.

డయల్ యువర్ విద్యుత్ సీఎండీ

కల్లూరు, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ లోతేటి శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొట్టమొదటిసారిగా ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, అనంతపురం, నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు మొబైల్ నంబర్: 8977716661కు కాల్ చేయాలని సూచించారు. ఆయా జిల్లాల పరిధలోని విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే వినియోగదారులు మొబైల్ నెంబరు : 9133331912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారులకు తెలియజేయవచ్చన్నారు.

బడులు బోసిపోతున్నాయ్..!


హెచ్‌జీ పాఠశాలల్లో 62మందికి గాను 30మంది మాత్రమే హాజరైన 4వ తరగతి విద్యార్థులు

- వలస బాటలో విద్యార్థులు
- తల్లిదండ్రులతో కలిసి పట్టణానికి పయనం
- పాఠశాలలో తగ్గిన హాజరు శాతం
- ఇలాగైతే అక్షరాస్యత మెరుగుపడేనా?

రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం కరువుతో నేటికీ విలవిలలాడుతోంది. ఆరుగాలం కష్టపడే అన్నదాతలు నిత్యం ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడిపోతున్నారు. బతుకుదెరువు కోసం బండెడు దుఃఖాన్ని దిగమింగుకొని వలసబాట పడుతున్నారు. పిల్లాపాపలతో కలిసి పని కోసం పట్టణాలకు పయనమవుతున్నారు. పలకా బలపం పట్టి బడుల్లో ఉండాల్సిన చిన్నారులు పత్తి పొలాల్లో, మిరప తోటల్లో మగ్గిపోతున్నారు. జీవితం అంటే ఏమిటో తెలియని వయస్సులో పనులు చూస్తూ.. చదువుకు దూరమై.. బతుకు భారమై.. జీవన పోరాటం సాగిస్తున్నారు. కోసిగి మండలం నిరక్షరాస్యతలో ముందుండేది. అలాంటి చోటకు ప్రభుత్వం కొత్త పంతుళ్లను నియమించింది. అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేసింది. అయినా లాభం లేకుండా పోయింది. విద్యార్థులు వలసబాట పట్టడంతో సర్కారు స్కూళ్లు బోసిపోతున్నాయి.



కోసిగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతంలో వలసలు ఎంత దారుణంగా ఉన్నాయో ప్రభుత్వ బడులను చూస్తే అర్థమవుతుంది. మండలంలోని 6,200మందికి పైగా విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి వలసబాట పట్టారంటే పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయో తెలుస్తుంది. ప్రాథమిక పాఠశాలలు 33, జిల్లా పరిషత్ పాఠశాలలు 15, మొత్తం 48 ప్రభుత్వ పాఠశాలల్లో 16,175 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించగా 48పాఠశాలల్లో 9,780 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6,395 మంది విద్యార్థులు తల్లిదండ్రుల వెంటే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. అక్షరాస్యతలో దేశంలోనే చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉన్న కోసిగిలో ఈ వలసల వల్ల అక్షరాస్యత మండలంలో పూర్తిగా హాజరు శాతం పడిపోతోంది.

కొత్త ఉపాధ్యాయులు వచ్చినా..

కోసిగి మండలానికి డీఎస్సీ ద్వారా 256మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. వివిధ బడుల్లో వారు విధుల్లో చేరారు. కొత్త టీచర్లతో ప్రభుత్వ పాఠశా లలు కళకళలాడాయి. కొత్త ఉపాధ్యాయులు వచ్చారు గానీ, విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లడంతో తరగతి గదులు బోసిపోతున్నాయి.


తల్లిదండ్రులు వలస వెళ్లడంతో అవ్వాతాతలతో ఉంటూ చదువుకుంటున్న అక్కాచెల్లెలు అఖిలేశ్వరి, మైత్రి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల వలసలపై జిల్లా అధికారులకు తెలియజేశాం. ముందే సీజనల్ హాస్టల్స్ వచ్చి ఉంటే కొంత మేర విద్యార్థుల వలసలు తగ్గేవి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

● బాలయ్య, ఎంఈవో, కోసిగి


హెచ్‌జీ పాఠశాలలో 99 మంది విద్యార్థులకు గాను 30 మంది హాజరైన 5వ తరగతి విద్యార్థులు

వలసలను నివారించేందుకు కృషి చేయాలి

పశ్చిమ ప్రాంతం అంటేనే గుర్తు వచ్చేవి వలసలు. ఇప్పటికే ఆయా మండలాల నుంచి వేలాది మంది వలసబాట పట్టారు. వలసలను నివారించేందుకు జిల్లా అధికారులు దృష్టి పెట్టాల్సి అవసరం ఉంది. ముఖ్యంగా కోసిగి మండలంపై ప్రత్యేక దృష్టి సారించి వలసలను నివారించి చిన్నారులు బడిబాట పట్టేలా ప్రయత్నించాల్సి ఉంది. విద్యార్థులందరూ బడికి వెళ్లితే అక్షరాస్యత కూడా మెరుగు పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే నిర్వహించేలా చూడాలని కోరుతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

బతుకుదెరువు వలస వెళ్తూ పెద్దలు.. తమ పిల్లలు ఇక్కడ ఉంటే పట్టించుకునే వారు ఉండరని, తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. ఒకవేళ ఇక్కడే సరైన వసతి ఏర్పాట్లు విద్యార్థులు కల్పిస్తే పిల్లలను అక్కడి చేర్పించి తాము వలస వెళ్తాం. ఆ సౌకర్యాలు లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో వెంట తీసుకెళ్తున్నామని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

గుండె చలించిపోతుంది



టీచర్లుగా నియామకమై పాఠశాలకు వచ్చినప్పుడు తరగతి గదుల నిండా విద్యార్థులు ఉండేవారు. వారం రోజుల వ్యవధిలో 60శాతం పైగా విద్యార్థులు వలస వెళ్లారు. తరగతి గదులు చూస్తే గుండె చలించిపోతుంది.

- అరివిలి అయ్యప్ప, హెచ్‌జీ పాఠశాల, కోసిగి

మా మాట వినడం లేదు



ఇక్కడే ఉండి కుటుంబ సభ్యులతో పిల్లలను పెట్టి చదివించాలని తల్లిదండ్రులకు చెబుతున్నాం. మావెంటే మాపిల్లలను తీసుకెళ్తామని చెబుతున్నారు. మేము అవగాహన కల్పించినా మా మాట వినడం లేదు.

● కె.భూపాల్ నాయుడు, హెచ్ఎం, సీజీ పాఠశాల, కోసిగి

చదువుకోవాలని ఉంది



అమ్మ, నాన్నలు కర్ణాటకకు వలస వెళ్తున్నారు. నన్ను కూడా బడి మాన్పించి తీసుకెళ్తున్నారు. ఇక్కడ ఉంటే అన్నం ఎవరూ పెట్టరు. అమ్మనాన్న వెంట వెళ్తాను. నాకు చదువుకోవాలని ఉంది.

● తలారి సాయి, 5వ తరగతి విద్యార్థి, సీజీ పాఠశాల, కోసిగి

60శాతం విద్యార్థులు..



ఈ ఏడాది పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం మరీ దారుణంగా ఉంది. సుమారు 60 శాతం విద్యార్థులు వలస వెళ్లిపోయారు. విద్యార్థులు లేకుండా తరగతి గదులను చూస్తుంటే బాధ వేస్తోంది. ప్రభుత్వం దృష్టి సారించాలి.

● సంజన్న, హెచ్ఎం, హెచ్‌జీ పాఠశాల, కోసిగి

సంతోషంగా స్కూళ్లకు వచ్చాం..



కొత్తగా టీచర్‌గా బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు పాఠాలు చెప్పాలని సంతోషంగా వచ్చాం. సగానికి పైగా విద్యార్థులు తల్లిదండ్రుల వెంట ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ దృశ్యం చూస్తే చాలా బాధగా ఉంది.

● వరలక్ష్మి, టీచర్, సీజీ పాఠశాల, కోసిగి

ఉద్యమాలు ఉధృతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బస్తిపాటి నాగరాజు, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ తదితరులు

- బిల్లు కోసం బీసీ సంఘాలు సమష్టిగా పోరాడాలి
- కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య
- కర్నూలులో బీసీ భవన్‌కు రూ.కోటి
- గజమాలతో సన్మానించిన కురువ సంఘం నాయకులు

కర్నూలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో బీసీ ఉద్యమాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టోల్ ప్లాజా దగ్గర ఎంపీ బస్తిపాటి నాగరాజు, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్ ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీలు కృష్ణయ్య, బస్తిపాటి నాగరాజును కురువ సంఘం నాయకులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఎంపీ నాగరాజు విన్నపం మేరకు బీసీ భవన్ నిర్మాణం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. దేశ జనాభాలో 56 శాతానికిపైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో సమాన అవకాశాలు దక్కడం లేదన్నారు. రాజకీయ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదం జరగాలని డిమాండ్ చేశారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బీసీ సంఘాలు సమష్టిగా జాతీయ స్థాయిలో ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. ఏపీలో కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, బీసీ బిల్లు ఆమోదం కోసం సీఎం చంద్రబాబు నాయకత్వం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త్వరలో చంద్రబాబును కలుస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై న్యాయస్థానాలు ఆశ్రయిస్తుండంతో అమలు జరగడం లేదని, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ బీసీ రాజ్యాంగ హక్కుల కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్యను అభినందిస్తున్నానన్నారు. బీసీల ఐక్యత కోసం ఆయన చేసిన పోరాట ఫలితమేగానే తాను ఎంపీ అయ్యానని చెప్పారు. అడిగిన వెంటనే బీసీ భవన్‌కు రూ.కోటి ఎంపీ నిధులు ఇవ్వడం అభినందనీయమన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్, ఏపీ కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, రాంబాబు, కుమ్మరి రామకృష్ణ, దేవశంకర్ పాల్గొన్నారు.

నదితీర ప్రాంతాల వద్ద భక్తులు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఆలయాలు, నదితీర ప్రాంతాల వద్ద రద్దీ అధికంగా ఉంటుదని భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. శైవ క్షేత్రాలు, నదితీరాల్లో వచ్చే భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పలు పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. కార్తీక పుణ్య స్నానాలు ఆచరించడానికి వెళ్లే భక్తులు తమ వెంట చిన్న పిల్లలను తీసుకెళ్లకూడదన్నారు. తప్పనిసరి పరిస్థితి అయితే చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు దేవాలయాల్లో దీపాలు వెలిగించి.. అలాగే కార్తీక దీపాలను నదులలో, కేసీ కెనాల్‌లలో వదిలే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓర్వకల్లు కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయం, బహ్మగుండేశ్వరస్వామి శివాలయం, నందవరంలో గురజాల గ్రామ శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. వీటితో పాటు రద్దీ ఉన్న ఆలయాలను గుర్తించి అక్కడ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మామను కలసిన అల్లుడు..!

- బసిరెడ్డితో వైసీపీ ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్‌రెడ్డి భేటీ
- అసమ్మతి నాయకులతో రాజీకి యత్నం
- ఎమ్మిగనూరు వైసీపీలో ఆసక్తిగా మారుతున్న రాజకీయాలు

కర్నూలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన ఎర్రకోట రాజీవ్‌రెడ్డి ఆ పార్టీ అసమ్మతి లీడర్ బనవాసి బసిరెడ్డితో ఆదివారం భేటీ కావడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. రాజీవ్‌రెడ్డికి బసిరెడ్డి మేనమామ అవుతారు. అయినా.. సీనియర్లను పక్కనబెట్టి, కార్యకర్తల అభిప్రాయాలను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఇన్‌చార్జిని మార్చడానికి బసిరెడ్డి వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మామ అల్లుడు భేటీ కావడం రాజకీయంగా చర్చగా మారింది. ఈ భేటీలో సీనియర్ నాయకుడు సోగనూరు భీమరెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తుంది. మామ అల్లుళ్ల మధ్య ఎలాంటి చర్చలు జరిగాయి..? మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట వారితో ఎలాంటి సందేశం పంపించారు..? అసమ్మతి వర్గం దిగివస్తుందా..? రాజకీయంగా ప్రత్యేక కుంపటి పెడుతారా..? ఎమ్మిగనూరు వైసీపీ కార్యకర్తల్లో వినిపిస్తున్న ప్రశ్నలివి. సుదీర్ఘ రాజకీయ అనుభవం, రాజకీయ వర్గాలను ఒంటిచేత్తో నడిపించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట వీటికి ఎలా చెక్ పెట్టబోతున్నారు... అంటూ పలువురు చర్చించుకోవడం కొసమెరుపు. వైసీసీ ఇన్‌చార్జిగా బీసీ చేనేత సామాజికవర్గానికి చెందిన మాజీ ఎంపీ బుట్టా రేణుకను తొలగించి ఆ స్థానంలో ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనవడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డిని నియమిస్తూ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని బుట్టా వర్గీయులతో పాటు సీనియర్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 'బుట్టా రేణుకను వద్దనుకున్నప్పుడు పెద్దాయన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి ఇచ్చి ఉంటే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని రాజీవ్‌రెడ్డి ఇవ్వడం ఎంతవరకు సమంజసం..? పార్టీ నిడిపించే సీనియర లీడర్లు లేరా..' అంటూ అసమ్మతి జెండా ఎగురవేశారు. శనివారం మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట స్వయాన అల్లుడు, మాజీ వైస్ ఎంపీపీ బనవాసి బసిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, నందవరం ఎంపీపీ లక్ష్మీదేవమ్మ కుమారుడు, ముగతి సర్పంచి విరుపాక్షిరెడ్డి, నందవరం మండల వైసీపీ కన్వీనర్ శివప్పగౌడ్, ఆ పార్టీ సీనియర్ నాయకులు హాలహర్వి రాంకోటిరెడ్డి, కనకవీడు పేట శ్రీనివాసరెడ్డి సహా పలువురు సీనియర్ నాయకులు సమావేశమైన రాజకీయ భవిష్యత్తుపై చర్చించిన విషయం తెలిసిందే. ఎర్రకోట నుంచి ఫోన్ రావడంతో సమావేశం వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో బసిరెడ్డితో ఇన్‌చార్జి రాజీవ్‌రెడ్డి సమావేశమై.. అధిష్టానం తనకు ఓ అవకాశం ఇచ్చిందని, సీనియర్లుగా తనకు సహకారం అందించాలని విన్నవించడంతో రాజీయత్నాలు చేసినట్లు సమాచారం. ఇదే విషయం తమ వర్గ నాయకులతో చర్చించిన తరువాతే నిర్ణయం తీసుకుంటామని రాజీవ్‌రెడ్డికి చెప్పిపంపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆదివారం వైసీపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు క్యాండిల్ ర్యాలీకి అసమ్మతి నాయకులు దూరంగా ఉన్నారు.

కర్నూలు జిల్లా త్యాగధనుల ఖిల్లా

- యువత మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి కర్నూలు జిల్లా త్యాగధనుల ఖిల్లా. ఎందరో మహనీయులు, కవులు, కళాకారులు, ప్రజా ప్రతినిధులు ఈ గడ్డకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారు..' అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న 'కర్నూలు ఉత్సవ్-2025' రెండో రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు ఏకాంకి పౌరాణిక పద్య నాటక పోటీలను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య ప్రారంభించారు. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. సాయంత్రం ప్రదర్శనలకు ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకు ముందు కళాక్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలుగుతల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు ఎమ్మెల్యే పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం అలనాటి స్వాంత్రంత్య సమరయోధులు, జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.

మిగతా 7వ పేజీలో

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ, టెట్, కానిస్టేబుల్, ఎస్ఐ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు పర్వీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీఈడీఎంఎండబ్ల్యూడీ.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 0866-2970567ను సంప్రదించాలని కోరారు.

భక్తులతో శ్రీమఠం కిటకిట



భక్తులతో కిటకిటలాడుతున్న మధ్వమార్గ్ కారిడార్

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం తరలివచ్చిన భక్తులతో భక్తజనసాగరంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో వేలాది మంది మంత్రాలయానికి తరలివచ్చారు. దీంతో స్వామి దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. మధ్వమార్గ్ కారిడార్, తుంగభద్ర కారిడార్, శ్రీమఠం ప్రాంగణం, రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణం ప్రధాన రహదారులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఏకాదశి కావడంతో ఎటువంటి ప్రత్యేక పూజలు, రథోత్సవాలు, ప్రసాదాలు లేవు. భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని దర్శించుకున్నారు.

5న లక్ష దీపోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న కార్తీక దీపోత్సవ సమితి మహిళా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఐదోతేదీ బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దీపోత్సవ సమితి కార్యాధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శులు స్వప్నసారధి, జయలక్ష్మి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని సాలమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం వారు దీపోత్సవ వివరాలు తెలిపే కరపత్రాలు విడుదల చేశారు. పన్నెండేళ్లుగా ఏటా కార్తీక పౌర్ణమి రోజున నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద మహిళలతో సామూహికంగా దీపోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఐదో తేదీ సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, శివపార్వతుల రథం ఊరేగింపు, ఆకాశదీపం, శివపార్వతులకు అభిషేకం, కల్యాణోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటితో పాటు తుంగాహారతి, లక్షదీపోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల్లో దీపోత్సవ సమితి గౌరవాధ్యక్షులు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి తదితరులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు రాధిక, అనురాధ, హేమ, సలహాదారులు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ కంపెనీకి వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలసీదారుడికి చెల్లించాల్సిన మెడికల్ క్లయిమ్ బిల్లును పూర్తిగా చెల్లించకుండా సేవాలోపం చేసిన ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీజీఎంగా పని చేస్తున్న ఉమామహేశ్వరరెడ్డి బ్యాంకు గ్రూప్ ఇన్సూరెన్స్ మెడికల్ పాలసీని తీసుకున్నారు. ఆ తర్వాత ఉమా మహేశ్వరరెడ్డి కూతురు కంటి ఆపరేషన్‌కు రూ.1.20లక్షలు ఖర్చు చేశారు. అయితే ఇన్సూరెన్స్ కంపెనీ కేవలం రూ.60వేలు మాత్రమే చెల్లించింది. దీంతో ఉమామహేశ్వరరెడ్డి సదరు కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసును దాఖలు చేశారు. క్లెయిమ్‌ను అసంపూర్తిగా పరిష్కరించడం సేవాలోపం అవుతుందని వినియోగదారుల కమిషనర్ నిర్ధారించింది. దీంతో ఫిర్యాదికి మెడికల్ క్లయిమ్ కింద రూ.30వేలు, మానసిక ఆవేదనకు గురి చేసినందుకు రూ.10వేలు, కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.5వేలను చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమ కౌసర్లు ఆదేశాలు జారీ చేశారు.

నేడు షటిల్, చెస్ జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న నంది బాడ్మింటన్ అకాడమీలో సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బాడ్మింటన్, చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు బి. విశ్వనాథ్, జి. ఆశాజ్యోతి తెలిపారు. అండర్-14, 17 బాల, బాలికల విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులే జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన అండర్-17 షటిల్ బాడ్మింటన్ బాల, బాలికల జట్లు ఈనెల 5న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటాయన్నారు.

ఎర్రచందనం రక్షణకు కొత్త రేంజ్



రుద్రవరం ఫారెస్టు రేంజ్ కార్యాలయం

- చాగలమర్రి కేంద్రంగా ప్రతిపాదనలు

రుద్రవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజన్‌లో ఎర్రచందనం వృక్ష సంపద రక్షణకు చాగలమర్రి కేంద్రంగా కొత్తగా రేంజ్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఫారెస్టు శాఖ ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రుద్రవరం ఫారెస్టు రేంజ్ సబ్ డివిజన్ పరిధిలో రుద్రవరం, చెలిమ రేంజ్‌లున్నాయి. కొత్తగా చాగలమర్రి రేంజ్ కూడా సబ్ డివిజను పరిధిలోకి వస్తుందని ఫారెస్టు అధికారులు తెలిపారు.

రుద్రవరం ఫారెస్టు రేంజ్ విభజన ఇలా

ప్రస్తుతం రుద్రవరం రేంజ్ 22,920.54 హెక్టార్లులో ఉంది. చాగలమర్రి ఫారెస్టు రేంజ్ ఏర్పాటు చేస్తే అది 19193.43 హెక్టార్లలో ఉంటుంది. అందులో నాలుగు సెక్షన్లు, 9 బీట్‌లు ఉంటాయి. పాతబీట్‌లు 4వేల హెక్టార్ల పైబడి విస్తరించి ఉంది. వాటిని ఫారెస్టుశాఖ ఉన్నతాధికారులు విభజించాలని ప్రణాళికలు తయారు చేశారు. ఎర్రచందనం వృక్ష సంపద రక్షణకు ఈ ఏర్పాట్లు చేయనున్నారు.

కొత్త రేంజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం



రుద్రవరం రేంజ్‌ను రెండుగా విభజించి చాగలమర్రి కేంద్రంగా కొత్త రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. ఎర్రచందనం సంరక్షణకు ఈ చర్యలు తీసుకుంటున్నాం.

- ముర్తుజావలి, రేంజర్, రుద్రవరం



ఎర్రచందనం వృక్షాలు

ఉసిరికాయలపై కార్తీక శోభ



ఉసిరికాయల మీద కార్తీక మాస ప్రత్యేక చిత్రాలు

నంద్యాల కల్చరల్, నవంబరు 02(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేశ్ కార్తీకమాసం సోమవారం సందర్భంగా ఉసిరి కాయలపై మూడు ప్రధానమైన చిత్రాలను మైక్రోబ్రష్ ద్వారా ఆక్రాలిక్ కలర్స్‌తో వేశారు. కార్తీకమాసంలో ఉసిరికి గొప్ప ప్రాధాన్యం ఉంది. ఉసిరి చెట్టు సాక్షాత్తు శివుని స్వరూపం అని చెబుతారు. అన్ని మాసాల కంటే కార్తీకమాసం ఎంతో పవిత్ర మాసం. ఈ మాసంలో సోమవారాలకు, కార్తీక పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉంది. ఈ మాసంలో ఉసిరికాయలతో దీపాలు వెలిగించి భక్తితో పూజలు చేస్తారు. ఉసిరిచెట్టును పూజించడం వలన సకల శుభాలు కలుగుతాయని, నవగ్రహదోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అందుకే ఎంతో విశిష్టత వున్న ఉసిరికాయ మీద చిత్రకారుడు కోటేశ్ సూక్ష్మ చిత్రాలు వేశాడు. ఈ చిత్రంలో పరమశివుడు అర్ధనారీశ్వరుని రూపంలో చిరునవ్వుతో భక్తులకు దర్శనమిచ్చి దీవిస్తున్నట్టు, ఉసిరి చెట్టు కింద ఉసిరి కాయలతో దీపాలు వెలిగించి భక్తులు పూజిస్తున్నట్లు, శివలింగం, శివాలయం, ప్రకృతి దృశ్యాలు, స్త్రీలు కార్తీక దీపాలు నదిలో వదిలి భక్తితో మొక్కుతున్నట్లు, భక్తులు పుణ్యనదిలో స్నానాలు చేస్తున్నట్లు ఇలా కార్తీకశోభను ఒకే చిన్న ఉసిరి కాయ మీద వేశారు.

ముగిసిన అంతర్జాతీయ నృత్యోత్సవం



ప్రతిభ కనపరిచిన కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఆళ్లగడ్డ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అంతర్జాతీయ నవనరసింహుల నృత్యోత్సవం ఆదివారం ముగిసింది. శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ నృత్యోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని స్తుతిస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనపరిచిన కళాకారులను అతిథులు, గురువులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లెంశెట్టి సురేష్ మాట్లాడుతూ సాంప్రదాయ కళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కథాకళి నాట్యగురువు శ్రీనివాస వరప్రసాద్, కూచిపూడి నాట్యగురువు సంధ్యాదేవి, మహేష్, వేణుగోపాల్, సత్య, సూరజ్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

దోపిడీ సమాజాన్ని బోనెక్కించిన రావిశాస్త్రి

సాహితీవేత్త వృద్ధుల కల్యాణ రామారావు



ప్రసంగిస్తున్న ప్రముఖ సాహితీవేత్త వృద్ధుల కల్యాణ రామారావు

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దోపిడీ సమాజాన్ని బోనులో నిలబెట్టిన సాహితీవేత్త రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని ప్రముఖ సాహితీవేత్త వృద్ధుల కల్యాణ రామారావు అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రం సాహిత్య సమావేశ హాలులో సాహితీ స్రవంతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 'రావిశాస్త్రి సాహిత్యం - ఒక పరిశీలన' అనే అంశంపై సభ నిర్వహించారు. తొలుత రావిశాస్త్రి చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన కల్యాణ రామారావు మాట్లాడుతూ లెఫ్టిస్టులు సమాజానికి వ్యతిరేకులు అనే ధోరణి పాలకుల్లో పెరిగిపోతోందని, దీనికి సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలే పరిష్కారం చూపుతాయని అన్నారు. దోపిడీ సమాజంలోని అసమానతలు కళ్లకు కట్టినట్లు రావిశాస్త్రి చూపించారని అన్నారు. సాహిత్యం ద్వారా గొప్ప సమాజం ఆవిష్కృతమవుతుందని నిరూపించిన ఏకైక రచయిత రావిశాస్త్రి అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ రావిశాస్త్రి సాహిత్యం నేడు ఔత్సాహిక రచయితలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ రావిశాస్త్రి కథలు ఒక్కొక్కటీ ఒక్కో ఆణిముత్యంలా నిలిచిపోతుందని అన్నారు. ఈ సదస్సులో సాహితీవేత్తలు చంద్రశేఖర శర్మ, ఎస్ఎండీ ఇనాయతుల్లా, విరసం నాయకుడు నాగేశ్వరరాచారి, సాహితీ స్రవంతి జిల్లా బాధ్యుడు ఆవుల చక్రపాణి, బాలగొని మధు, కథా రచయిత టి మధుసూదన శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు 220 పాకెట్ల బియ్యం



అంధుల అనాథాశ్రమానికి బియ్యం పంపిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి హైదరాబాద్‌లోని దేవనార్ అంధుల పాఠశాలకు 200 పాకెట్లు సోనా మసూరి బియ్యాన్ని,అలాగే కడప జిల్లా సిద్ధవటంలోని అనాథ ఆశ్రమానికి మరో 20 పాకెట్లు ఆదివారం వితరణ చేశారు. తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం గత నాలుగేళ్లుగా అనాథ ఆశ్రమాలకు ఆయన బియ్యం పాకెట్లు అందజేస్తున్నారు. ఈఏడాది రూ.6.20 లక్షల విలువ చేసే 50 కిలోలు గల 220 పాకెట్లు బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉపసర్పంచ్ బురానుద్దీన్, వంగల పరమేశ్వరరెడ్డి, అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

నదిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని తుంగభద్ర గ్రామానికి చెందిన అమ్రేష్ గౌడు, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు వీరేంద్రగౌడు (24) అనే యువకుడు తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. మాధవరం ఎస్ఐ విజయకుమార్, వీరేంద్రగౌడు బంధువులు తెలిపిన వివరాలివీ.. వీరేంద్ర గౌడ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తోటి స్నేహితులతో కలిసి రైల్వేబ్రిడ్జి సమీపంలో తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నదిలో గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు. నీటిలో నుంచి బయటకు తెచ్చేలోపు ప్రాణాలు కోల్పోయాడు. మాధవరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

అవుకు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన కోనేటి వెంకటన్న(60) జీవాలను కాచుకుంటూ, కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ కలహాలు జరిగేవి. ఈ కారణంగా గ్రామ సమీపంలోని పొల్లాలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. స్థానికులు సమాచారమివ్వగా కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి వెళ్లి అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



బత్తు కిరణ్ (ఫైల్)

వెలుగోడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు పట్టణంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని ఎస్పీజీ పాలెంకు చెందిన బట్టు ప్రసాద్ కుమారుడు కిరణ్ (38) బస్టాండు సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు వలంటీర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉండి తాగుడుకు అలవాటుపడ్డాడు. శనివారం రాత్రి బయటకు వెళ్లిన కిరణ్ బస్టాండు సమీపంలో మృతి చెందాడు. మృతుడి అన్న చెన్నయ్య పోలీసులకు సమాచారం అందించగా, వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, శవ పరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కర్నూలు జిల్లా త్యాగధనుల ఖిల్లా

(5వ పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరు చరితారెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటూ జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే విధంగా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉంచారని గుర్తు చేశారు. కళాకారులకు ఇళ్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు ఇతర అంశాలపై తనవంతు సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి, కళాక్షేత్రం ప్రతినిధులు సీవీ రెడ్డి, మహమ్మద్ మియా, బాల వెంకటేశ్వర్లు, సంగా ఆంజనేయులు, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, కేవీ రమణ, రాముడు, కదిరి రమేష్, ఈశ్వరయ్య, వీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- రంగస్థల కళాకారులకు పురస్కారాలు : కర్నూలు ఉత్సవ్-2025 రెండోరోజు నాటక రంగంలో విశేష కృషి చేసిన వారికి విశిష్ట పురస్కారాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అందజేశారు. పురస్కారాలు అందుకున్న నటీనటుల్లో రంగారెడ్డి (పత్తికొండ), మల్లారెడ్డి (హంసేనాపురం), హెచ్. చంద్రన్న, ఎంఆర్ రాధిక, సి.శ్రీనివాసులు (మేకప్‌మెన్), (కర్నూలు), సిద్దయ్య (ఆళ్లగడ్డ), సాయిబాబా (తూడిచర్ల), శారదాబాయి, రామబ్రహ్మం (మేకప్‌మెన్, నంద్యాల) ఉన్నారు. కళాకారులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువతో ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా సాయిప్రదీప్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీనివాసులు బృందం, ప్రజా వేదిక కరుణాకర్ బృందం కోలాట ప్రదర్శన, గజల్ గాయకుడు మహ్మద్ మియా ఆధ్వర్యంలో కళాకారుల జానపద సంగీత విభావరి ఆకట్టుకుంది.



పాణ్యం ఎమ్మెల్యేతో నృత్య ప్రదర్శనలు చేసిన కళాకారులు

అధ్యాపకుల తొలగింపునకు కుట్ర



- ఖండించిన విద్యార్థి సంఘాలు
- కోర్టు ఉత్తర్వులు సైతం ధిక్కరణ?
- మందకృష్ణ మాదిగను కలిసిన అధ్యాపకులు
- నేడు ఆర్‌యూ ఎదుట ఆందోళన

కర్నూలు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఆరుగురు అధ్యాపకుల తొలగింపునకు యూనివర్సిటీ అధికారులు కుట్ర చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్‌యూ (రాయలసీమ యూనివర్సిటీ)లో ఆగస్టు 28, 29 తేదీల్లో వర్సిటీలో పనిచేస్తున్న 49 మంది కాంట్రాక్టు, టైం స్కేల్ అధ్యాపకులకు పర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిని వ్యతిరేకిస్తూ వర్సిటీలో 2007 నుంచి పని చేస్తున్న అధ్యాపకులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలకు హాజరు కాలేదు. వారిని విధుల నుంచి తొలగించినట్లు ఆర్‌యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని వ్యతిరేకిస్తూ తమపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని అధ్యాపకులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. కోర్టు వీరికి అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ వీసీ, రిజిస్ట్రార్ వ్యవహరించారు. అధ్యాపకుల తొలగింపు విద్యార్థి సంఘాలు సైతం ఖండించాయి. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను అధ్యాపకులు ఆశ్రయించారు. స్పందించిన ఆయన బడుగు, బలహీనవర్గాలను వేధించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఉన్నత వర్గాల వారిని వదిలేసి బడుగుల వర్గాలు, విద్యార్థులకు పాఠాలు బోధించే వారిని కడుపు కొడతారా? ఇదెక్కడి న్యాయం.. ఆందోళనలు చేపట్టండి.. నేను వస్తా అని మందక్రిష్ణ హామీ ఇచ్చారని అధ్యాపకులు తెలిపారు.

ఆందోళనలకు సిద్ధం

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క రాయలసీమ యూనివర్సిటీలోనే పర్ఫార్మెన్స్ ఇంటర్వ్యూలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఆర్‌యూ అధికారుల పనితీరును నిరసిస్తూ సోమవారం నుంచి వర్సిటీ ఎదుట నిరవధిక దీక్ష, ఆందోళనలు చేపట్టేందుకు అధ్యాపకులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. వీరికి మద్దతుగా రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులు కూడా ఆందోళనలు చేస్తామని హామీ ఇచ్చారని అధ్యాపకులు తెలిపారు. వీరికి మద్దతుగా విద్యార్థి సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.

న్యాయం జరగడం లేదు

తమ సమస్యల పరిష్కారం కోసం కోర్టు ఉత్తర్వులతో రిజిస్ట్రార్‌ను సంప్రదించాం. న్యాయం జరగడం లేదు. మరోసారి సోమవారం కలుస్తాం. స్పందించని పక్షంలో ఆందోళనలు చేపడుతాం. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులు మద్దతు తెలిపారు. అవసరమైతే కలెక్టర్‌ను కలిసి కోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరతాం.

●సాయినాథ్, సెక్రటరీ, కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్

అధ్యాపకుల జీవితాలతో చెలగాటం..

హైకోర్టు ఉత్తర్వులు అమలుచేయకుండా కాంట్రాక్టు అధ్యాపకుల జీవితాలతో చెలగాట మాడటం సరికాదు. అధికారులు వెంటనే స్పందించాలి. యూజీసీ నిబంధనల మేరకు అకాడమీ పర్ఫార్మెన్స్ రివ్యూకు హాజరు కావాల్సిన అవసరం లేదని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అధ్యాపకులను విధుల్లో తీసుకోవాలని, పకులను విధుల్లోకి తీసుకోవాలి. లేని పక్షంలో వారికి మద్దతుగా ఆందోళన చేపడతాం.

●మహేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీడీఎస్‌యూ

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

దుష్ప్రచారంపై హైదరాబాద్‌వాసికి నోటీసు

• నేడు హాజరు కానున్న యాంకర్ శ్యామల

కర్నూలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం చేసిన హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ రెడ్డికి ఆదివారం నోటీసులు జారీచేశారు. ఐదు రోజుల్లో విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే నోటీసులు అందుకున్న వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల నేడు కర్నూలు డీఎస్పీ ఎదుట హాజరు కానున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఓర్వకల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సభ్యులకు సూచించారు. ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి సహకరిస్తుందన్నారు.

పూర్వ అధ్యక్షుడికి సన్మానం



వెంగళ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏపీ ఎన్జీవోస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు వెంగళ్ రెడ్డిని ఆదివారం సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ, సభ్యులు హాజరయ్యారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

• రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



నాలుగో పట్టణ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీససులు

కర్నూలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని పోలీసులు రౌడీషీటర్లకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేర చరిత్రగలవారిని, పోలీస్ స్టేషన్లకు పిలిపించి సీఐలు, ఎస్‌ఐలు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 2010 కంటే ముందు ఎంపికైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇచ్చేలా పార్లమెంటులో మాట్లాడాలి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం కోరారు. ఆదివారం కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ అంశంపై మాట్లాడి, విద్యాహక్కు చట్టంలో సవరణ చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రామకృష్ణయ్య, శేషయ్య, తులసీశ్వరరెడ్డి, హేమంత్‌బాబు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

బాధితులు నేరుగా ఫిర్యాదు చేయండి



ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు

సి.బెళగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు అన్నారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం టీడీపీ నాయకులు ఎస్‌ఐను సన్మానించారు.

ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌లకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

కల్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దటేకూరు గ్రామంలో ట్రైనీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌లు శిక్షణలో పాల్గొన్నారు. కల్లూరు ఎంపీడీవో జి.నాగశేషాచలరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, హార్టికల్చర్, పశు సంవర్థక శాఖపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ట్రైనర్ ఆశ్రఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బ్యాడ్మింటన్, చెస్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా క్రీడాకారులకు సోమవారం బ్యాడ్మింటన్, చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి టి.కృష్ణ విశ్వనాథ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 4వ తేదీన నంద్యాల రైల్వేస్టేషన్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు 5, 6 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

తవ్వారు.. వదిలేశారు



అర్బన్ పరిధిలోని 35వ వార్డులో అభివృద్ధి పనులు ఆశించిన మేరకు సాగడం లేదు. చెన్నమ్మ సర్కిల్ నుంచి సెట్కూరు కార్యాలయం వరకు రహదారి విస్తరణ పనులు నెల క్రితం ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ప్రధాన రోడ్డు పక్కనే తవ్వి వదిలేయడంతో కాలనీల్లోకి వెళ్లే మార్గం లేక ప్రజలు సతమతమవుతున్నారు. సమీపంలోనే పాఠశాలు ఉన్నాయి. దీంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారిని వేగంగా పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. - **కల్లూరు**

బస్టాండు ఎక్కడ?



మండల కేంద్రంలోని బస్టాండును వ్యాపారులు కబ్జా చేశారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు అవకాశం లేకుండా పోయింది. వ్యాపారులు బంకులు, తోపుడు బండ్లు పెట్టుకోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సి.బెళగల్ నుంచి రోజుకు 30 నుంచి- 40 బస్సులు వెళుతుంటాయి. బస్సు కోసం వేచి ఉండాలంటే ఇబ్బందులు తప్పడం లేదని, రోడ్డుపైనే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. పంచాయతీ, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండు నుంచి దుకాణాలను తొలగించాలని కోరుతున్నారు. - **సి.బెళగల్**

జయహో భారత్..





ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత మహిళల జట్టు అనుకున్నది సాధించింది. మెగా టైటిల్ ఫైట్‌లో దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన ఉత్కంఠ మ్యాచ్‌లో భారత్ గెలుపొందింది. సెమీస్‌లో గెలిచిన అనంతరం క్రికెట్ అభిమానుల్లో ఫైనల్ మ్యాచ్‌పై ఆశలు పెరిగాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా క్రీడాభిమానులు, నాయకులు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి దేశభక్తిని చాటుకున్నారు. కర్నూలు నగరంలోని ఇండోర్ స్టేడియంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి భారత మహిళల జట్టు గెలుపొందగానే యువకులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. - **కర్నూలు స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి)**

యువతి అదృశ్యం.. కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందిన లక్ష్మీ ప్రసన్న అనే యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు.. లక్ష్మీప్రసన్న ఇంటర్ చదివి నారాయణ కళాశాలలో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. గత నెల 30న ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లి కళాశాలకు వెళ్లి విచారించగా, యువతి ఆ రోజు కళాశాలకు రాలేదని యాజమాన్యం వారు తెలిపారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మడోట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి సంఘం నూతన కార్యవర్గం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆదివారం బీసీ విద్యార్థి సంఘం నూతన కార్యవర్గానిన ప్రకటించారు. అధ్యక్షుడిగా కటారుకొండ సాయికుమార్, జనరల్ సెక్రటరీగా, కడుమూరు గిరీష్, సెక్రటరీ, రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా కురువ సురేంద్ర, జిల్లా అధ్యక్షుడిగా పోతులపాడు నాగరాజు, జిల్లా సహాయధ్యక్షుడిగా కురువ రంగన్నను, ఇతరులను నియమించారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిడ్స్‌వరల్డ్ పార్కులో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ జరిగింది. ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ బొల్లెద్దుల ప్రశాంత్‌బాబు ప్రారంభించి క్రీడాదుస్తులు అందజేశారు. కోచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి టి.అజయ్, నాగరాజు, వెంకట్, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుబేర నాయుడు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కుబేర నాయుడు ఎంపికయ్యారు. ఆదివారం నగరంలోని ఎ.క్యాంప్ మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ కార్యవర్గ సమావేశం అబ్జర్వర్ వెంకటేశ్, సీఈవో, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రిటర్నింగ్ ఆఫీసర్ అడ్వకేట్ వంశీకృష్ణ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా రంగముని, కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా ఉమామహేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా అయ్యన్నగౌడు, కార్యవర్గ సభ్యులుగా మాధవి, శాంతరాజ్‌ను ఎన్నుకునట్లు తెలిపారు.



ఎంపికైన సభ్యులు

వన భోజనానికి వచ్చిన ఎంపీ ఆర్. కృష్ణయ్య



అతిథులను సన్మానిస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని పెదపాడు బీరలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కురువల వనభోజనంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, హిందూపురం ఎంపీ పార్థసారధి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. వారిని కురువ సంఘం నాయకులు సన్మానించారు. బీసీ విద్యార్థి సంఘం కోఆర్డినేటర్ అరుణ్, కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

హిస్టెరోస్కోపీలో ఆధునిక పద్ధతులు

కర్నూలు హస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జోహరాపురం రోడ్డు అశ్వినీ హాస్పిటల్‌లో గైనకాలజీ వైద్యులకు హిస్టోరోస్కోపీలో శిక్షణ ఇచ్చారు. పూణేకు చెందిన డా.వినాయక్ మహాజన్ ఆధునిక పరికరాలతో, సురక్షమైన శస్త్ర చికిత్స పద్ధతులను వివరించారు. గైనిక్ హెచ్‌వోడీ డా.బి.ప్రమీల మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణలో ఆధునిక శస్త్రచికిత్సలను యువ గైనకాలజిస్టులకు నేర్పించడం అవసరమన్నారు. డా.బిటీ సీత, డా.వెంకటరమణ, డా.రాధారాణి, అనస్తీషియా ప్రొఫెసర్ డా.రామశివ నాయక్ పాల్గొన్నారు.



నూతన పద్ధతులను వివరిస్తున్న డా.మహాజన్

వలస బండి



శింగవరం, ముడుమాల, ఇనగండ్ల, గ్రామాల నుంచి కూలీలు ఆదివారం గుంటూరుకు భారీగా వలస వెళ్లారు. తమ గృహాల వద్ద తల్లిదండ్రులు, వృద్ధులను కాపలా పిల్లలతో కలిసి వెళుతున్నట్లు తెలిపారు. మండలంలో పనులు దొరకడం లేదని, అధికారులు ఉపాధి పనులు కల్పించకపోవంతో వలస తప్పలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. - **సి.బెళగల్.**

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సంస్థ సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి వినతులు స్వీకరిస్తామని ప్రజలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు https://meekosam.ap.gov.in లోచూడవచ్చని పేర్కొన్నారు.

పోలీసులు కొట్టారని..

• యువకుడి ఆత్మహత్యాయత్నం

కర్నూలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసులో పోలీసులు అకారణంగా కొట్టారన్న మనస్థాపంతో కోటేశ్వరరావు అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. గద్వాల జిల్లాకు చెందిన కోటేశ్వరరావు కర్నూలులో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గత నెల 29న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైంది. ఆ బాలిక తల్లిదండ్రులు రామ్‌నాయక్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం గాలించగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రామ్‌నాయక్ మిత్రుడు కోటేశ్వరరావును శనివారం పోలీసులు విచారించారు. అదే రోజు రాత్రి కోటేశ్వరరావు రేడియో స్టేషన్ ఎదురుగా ఉన్న రిలయన్స్‌మార్ట్ వద్ద పురుగల మందు తాగాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు తనను కొట్టడంతోనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించాడు.

జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలని కోరుతూ తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి.అంజిబాబు కోరారు. ఆదివారం కేకే భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. విద్యుత్ కార్మికులందరికీ ఒకే వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కోడుమూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి విద్యుత్ స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద ఆదివారం ఎద్ల బండిని బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల తెలిపిన మేరకు.. ముడుమలగుర్తి గ్రామానికి చెందిన పాలిదాసు రంగడు, సువార్తమ్మ దంపతులు పత్తి తీసే పనికి వెళ్లారు. సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే ప్యాలకుర్తి దాటాక చీకట్లో గమనించకపోవడంతో వీరి బైక్ ముందు వెళుతున్న ఎడ్లబండిని ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న రంగడు తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు.

మృతుల సంస్మరణ

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సమాధుల తోటలలో క్రైస్తవులు మృతుల సంస్మరణ ఆదివారం నిర్వహించారు. నవంబరు 2న క్రైస్తవులంతా మృతిచెందిన వారి పెద్దల సమాధులను శుభ్రం చేసి, ఆత్మల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. బుధవారంపేటలోని క్రైస్తవ సమాధుల తోటలో కర్నూలు బిషప్ గోరంట్ల జోహన్నెస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కె. ప్రతాపరెడ్డి, జాన్ డేవిడ్, డెవిడ్ అర్లప్ప, రాజు ఉన్నారు.

విజయవాడకు ఇంటర్ సిటీ రైలు నడపాలి



మాట్లాడుతున్న నాయకురాలు నిర్మల

కర్నూలు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని నాయకురాలు పి.నిర్మలమ్మ డిమాండ్ చేశారు. కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ ఆవరణలో సీపీఎం నాయకుల దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరింది. రజధానికి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. 11 ఏళ్లలో ప్రభుత్వాలు మారినా నగర ప్రజలకు ఆవగింజంత మేలు కూడా చేయడంలేదని ఆరోపించారు. మొదటి రాజధాని అని చెప్పుకుంటూ తిరిగే నాయకులు రాజధానికి రైలు వేయించలేకపోతున్నారని విమర్శిం చారు. సీఎం చంద్రబాబు, ప్రధానమంత్రిపై ఒత్తిడి తెచ్చి నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాముడు, లక్షణ్, గౌస్ దేశాయ్, ఆనంద్‌బాబు, లోకేశ్ పాల్గొన్నారు.

వెంకటకృష్ణకు పురస్కారం

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కవి, సాహిత్య విమర్శకుడు జి.వెంకటకృష్ణకు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన అమృతలత సంస్థ ఆదివారం జీవన సాఫల్య పురస్కారం అందజేసింది. అవార్డు ప్రదాత విద్యావేత్త డాక్టర్ అమృత లత, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ డాక్టర్ మృణాళిని, ఇతర సాహితీ ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు.



పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న జగన్నాథం

కల్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు మండలం పెద్దటేకూరులో మహేష్ ఆధ్యతన నిర్వహించిన సమావే శానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. 60 ఏళ్ల నిండిన రైతులకు నెలకు రూ.10వేల ఫించన్ ఇవ్వాలని కోరారు. పుల్లన్న, భాషా, కృష్ణనాయక్, బి.రాముడు పాల్గొన్నారు.

గులాబీ పురుగు నమిలేస్తోంది..

• పత్తి కాయలను తినేస్తున్న పురుగు • గుండెలు బాదుకుంటున్న రైతులు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు



కాయలో గులాబీ పురుగు

ఓర్వకల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి పంటను గులాబీ పురుగు నాశనం చేస్తోంది. ఏ మందు పిచికారీ చేసినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, హుడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, హుశేనాపురం, తదితర గ్రామాల్లో 4,500 హెక్టార్లలో పత్తి సాగు చేశారు.

తగ్గిన దిగుబడి..

పత్తి సాగుకు ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడి అవుతుంది. గతేడాది ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది పెరుగు దెబ్బకు 5 క్వింటాళ్లు కూడా వచ్చేలా లేదని రైతులు దిగులు చెందుతున్నారు. ఎన్ని మందులు వాడినా పురుగు అదుపులోకి రాకపోవడంతో పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. దీనికి తోడు మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

కాయ దశలో పురుగు ఉధృతి

పంట ఏపుగా పెరగడంతో రైతులు ఈ ఏడాది పంట బాగా వస్తుందని ఆశించారు. అయితే గులాబీ పురుగు సోకడంతో పంట పూర్తిగా నాశననమవుతోంది. పురుగు రసం పీల్చడంతో పూత వాడిపోయి నేలపాలవుతోంది. అలాగే పత్తి కాయల్లో పురుగు ఉండటంతో వాడిపోయి నల్లగా మారాయి.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి



గులాబీ పురుగు నివారణకు పొలంలో ఎకరాకు 5 నుంచి 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. అలాగే సస్యరక్షణతో పత్తి పంటను కాపాడుకోవాలి. గులాబీ పురుగు రాకుండా వేపనూనె ఆక్సీఫైడ్ పిచికారీ చేయాలి. - **మధుమతి, ఏవో, ఓర్వకల్లు**

గల్లీ గల్లీకి క్రికెట్ ఫీవర్


జాతీయ జెండా చూపుతూ కేరింతలు కొడుతున్న చిన్నారులు


కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో క్రికెట్‌ను వీక్షిస్తున్న విద్యార్థినులు

పత్తికొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబైలో జరుగుతున్న ఇండియా-దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ ప్రపంచకప్ పోటీల వీక్షణ కోసం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పత్తికొండలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. తేరుబజారు మీటింగ్ కట్టపై ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా క్రికెట్ చూసేందుకు టీడీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విరామ సమయంలో అల్పాహారం కూడా ఏర్పాటు చేశారు. మొదటి బ్యాటింగ్ ఇండియా జట్టు చేపట్టడం భారీ షాట్‌లతో క్రీడాకారులు స్కోరు సాధిస్తూ ముందుకు పోతుండడంతో జయహో భారత్ అంటూ చిన్నారులు జాతీయ జెండాలతో కేరింతలు కొడుతూ హర్షం వ్యక్తం చేశారు. మహిళా క్రికెట్ జట్టు కోసం ఎమ్మెల్యే చేసిన ఏర్పాట్లతో హర్షం వ్యక్తం చేశారు.

ఆదోని: క్రీడల్లో మహిళా శక్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆదివారం జరిగిన ఐసీసీ మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ఆదోని నియోజకవర్గంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వీక్షించారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు ఆదోనిలోని కస్తూరిబా గాంధీ షైనార్టీ కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్రీడలకు ముఖ్యంగా మహిళా క్రీడాకారులకు నిరంతర మద్దతు అందించాలనే తమ నిబద్ధతను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి పునరుద్ఘాటించారు. ప్రత్యేక ఏర్పాట్లపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి


మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం కల్తీ మద్యాన్ని ప్రోత్సహించడం వల్లే రోడ్డు ప్రమాదాలు, హత్యలు అధికమయ్యాయని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆరోపించారు. ఆదివారం ఆలూరు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం వల్ల మొన్న బస్సు ప్రమాదం, కాశీబుగ్గ ఆలయంలో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వీటిపై దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే బీసీ నేత మాజీ మంత్రి జోగి రమేష్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వైసీపీ నాయకులు మల్లికార్జున, భాస్కర్, గిరి, అరికెర వీరేష్, మరకట్టు ఎల్లప్ప, వరుణ్, నాగేంద్ర, రాజు, దేవరాజు, రంగన్న పాల్గొన్నారు.

ఇస్వీ ఎస్‌ఐగా మహేష్ కుమార్



ఆదోని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండల ఇస్వీ ఎస్.ఐగా మహేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లోభాగంగా, పెద్దతుంబళం ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న మహేష్ కుమార్ ఇస్వీకి, ఇస్వి ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నాయక్ కర్నూలు విఆర్‌కు బదిలీ అయ్యారు. ఆదివారం మహేష్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపడతామన్నారు.

ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఆలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాదాసి మాదారి కురువలకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేసేవిధంగా కృషి చేయాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని కలిసి విన్నవించినట్లు ఆలూరు మాదాసి మాదారి కురువ సంఘం తాలూకా నాయకుడు బెలగంటి కురువ హనుమప్ప తెలిపారు. మాదాసి మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని జొన్నగిరిలో వాహనాలు తనిఖీ చేశారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం


ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి జ్ఞాపికలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకుఎంతో గర్వ పడుతున్నామనీ, పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్‌ఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐటీ డిజిటల్ వింగ్ అండ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యనభ్యసించి ఉపాధ్యాయులు, పోలీసులుగా ఎంపికైన పూర్వ విద్యార్థులకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. అలాగే పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని, ముఖ్యంగా పేద విద్యార్థులకు అండగా ఉంటామని, పాఠశాల రుణం తీర్చుకోవడానికి ముందుంటామన్నారు. సన్మానగ్రహీతలు ఎస్‌ఐ క్రాంతి, సాయి, శివ, అనిత, రాజేష్, అమీనా, వ్యాయామ ఉపాధ్యాయుడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి వైద్యం కోసం ఆర్థిక సాయం

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న 2000-01లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆలూరు మండలంలోని అగ్రహారం గ్రామానికి చేరుకుని మిత్రుడు వన్నూరుస్వామిని పరామర్శించారు. వైద్యం కోసం రూ.24 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఆదుకున్న వాడే నిజమైన స్నేహితుడని ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1, 2 పూర్వపు విద్యార్థులు అన్నారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ


సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

మద్దికెర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది నవంబరు 2వ తేదీ క్రైస్తవులు జరుపుకునే సమాధుల పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సమాధుల పండుగ పురస్కరించుకుని గ్రామ శివారులోని క్రైస్తవ శ్మశానంలో మరణించిన వారి పెద్దల సమాధులకు ప్రార్థనలు నిర్వహించి కొవ్వొతులు వెలిగించారు. సమాధుల పండుగ చేసుకోవడం వల్ల పరలోకంలో ఉన్న వారి ఆత్మశాంతి కలుగుతుందన్నారు. అనంతరం క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు ముత్యాల సురేష్, ఆంథోని, భైరెడ్డి రవి, భైరెడ్డి ఆనంద్ తదితరులు ఉన్నారు.

'ఎన్ని త్యాగాలకైనా సిద్ధం'

● మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్


ఐక్యతను చాటుతున్న నాయకులు

ఆదోని టౌన్ , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా సాధన కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ అన్నారు. ఆదివారం జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహ్మద్ అధ్యక్షతన కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా సాధన కోసం జరిగే పోరాటానికి ప్రకాష్ జైన్ తన సంపూర్ణ మద్దతు తెలుపుతూ, ఆదోనిలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తే భవన నిర్మాణాల కోసం పది ఎకరాల స్థలాన్ని ఇస్తానని ప్రకటించారు. జిల్లా ఏర్పాటు పై ప్రస్తుత ఎమ్మెల్యేకు చిత్త శుద్ధి ఉంటే అన్ని కుల, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, రాజకీయ, ప్రజా సంఘాలతో జిల్లా సాధన కోసం ఎందుకు సమావేశం ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీఎస్‌పీ మాజీ జిల్లా అధ్యక్షుడు శాంతకుమార్, పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్, మాట్లాడుతూ ఆదోని జిల్లా ఏర్పాటు కాకుండా కర్నూల్ నుండి కొందరు పెద్దలు అడ్డు పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయని, అయినా తమ పోరాటాన్ని ప్రజలను కలుపకొంటూ ఉధృతంగా కొనసాగిస్తామన్నారు. షాహీ జామియా మస్జీద్ ఖతిబ్ సాబ్, జూనైద్ అలీ హష్మీ, డీఎస్‌ఎఫ్ నాయకులు ఉదయ్, బాలు లబ్బాయిక్ సేవా సంస్థకు చెందిన మన్సూర్, పెద్ద హరివాణకు చెందిన సోషల్ వర్కర్ పరమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలో తీవ్రతరమవుతున్న తాగునీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల దాహార్తిని తీర్చాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ సూచించారు. ఆదివారం రాత్రి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో తాగునీటి సమస్యపై అధికారులు, వాటర్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఆలూరులో 15 రోజులకొకసారి నీరు ఎందుకు సరఫరా అవుతున్నాయి.. ప్రజలు రోడ్డెక్కి ధర్నాలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. బాపురం రిజర్వాయర్‌లో నీరు ఉన్నా ఎందుకు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతున్నారని ప్రశ్నించారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే సమస్య తలెత్తిందన్నారు. తాగునీటి సమస్యపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈ మల్లికార్జున, ఏఈ రామ్‌లీలా, డిప్యూటీ ఎంపీడీఓ అరుణ్ రషీద్, పంచాయతీ కార్యదర్శి జిలానీ, బాపురం స్కీం కాంట్రాక్టర్ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టు సాధన కోసం పాదయాత్ర

ఆలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంతానికి జీవనాధారం కోసం సాగు, తాగునీటికై పెండింగ్‌లో ఉన్న వేదావతి ప్రాజెక్టు, నగరడోన రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి నిర్మాణం పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి.అంజిబాబు, ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతిబసు భవనంలో వేదావతి, నగరడోన ప్రాజక్టుల సాధనకై ఈనెల 9, 10న తలపెట్టిన పాదయాత్రపై సీనియర్ నాయకులు నారాయణస్వామి అధ్యక్షతన సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. క్రిష్ణ, షాకీర్, మైన, ఈరన్న, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పత్తిని తేమ లేకుండా విక్రయానికి తీసుకురావాలి

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు తేమ లేకుండా ఇంటి వద్దనే బాగా ఆరబెట్టుకొని విక్రయానికి తీసుకురావాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నేటి నుంచి యధావిధిగా కనీస మద్దతు ధరతో పత్తిని రైతులు నుంచి సీసీఐ కొనుగోలు చేస్తుందన్నారు. ముందుగా రైతులు స్లాట్ బుక్ చేసుకున్న వారు వారికి కేటాయించిన జిన్నింగ్ పరిశ్రమలో పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పాటు మొబైల్ నెంబర్ తీసుకొచ్చి విక్రయించుకోవాలని కోరారు. 8 శాతం నుండి 12 శాతం లోపు పత్తి తేమశాతం ఉంటేనే సీసీఐ కొనుగోలు చేస్తుందన్నారు. తక్కువ ధరకు మార్కెట్‌లో పత్తి నమ్ముకొని నష్టపోవద్దని సూచించారు. గ్రామ రైతు సేవా కేంద్రాలలో ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని కంపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఎస్‌ఐలు


మీనాక్షినాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన ఇస్వీ ఎస్‌ఐ మహేష్‌కుమార్

ఆదోని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని నియోజకవర్గ పరిధిలోని రెండు పోలీస్‌స్టేషన్‌లలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆదివారం మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇస్వీ నూతన ఎస్‌ఐగా మహేష్‌కుమార్, పెద్దతుంబలం ఎస్‌ఐగా మల్లికార్జునలు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐలు మీనాక్షినాయుడిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట వ్యవస్థ పటిష్ఠతకు నిబద్ధతతో కృషి చేయాని ఎస్‌ఐలకు సూచించారు. స్పందించిన నూతన ఎస్‌ఐలు మహేష్‌కుమార్, మల్లికార్జున తమ తమ ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై న్యాయస్ఫూర్తితో కూడిన సేవలను అందిస్తామన్నారు.

'కందిపంటను కాపాడుకోండి..'

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పు వల్ల కంది పూతలు రాలిపోయి దిగుబడి తగ్గుతుందని వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 15వేల ఎకరాలకు పైగా కంది పంటను సాగు చేశారనీ.. మొంథా తుఫాన్, ముసురు వలన కంది పూత రాలిపోయే అవకాశం ఉందని, అందు కోసం రైతులు ముందస్తు జాగ్రత్తగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు అవసరమైతేనే పంటలపై మందులు పిచికారి చేయాలన్నారు. అధికంగా మందులు పిచికారి చేస్తే పంట బెట్టకు వస్తుందన్నారు. మందుల ఉపయోగం కూడా తగ్గించాలని తెలిపారు.

యాప్‌ల భారం నుంచి విముక్తి కలిగించాలి

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు యాప్‌ల భారం నుంచి విముక్తి కలిగించాలని ఎస్‌టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల వల్ల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే బోధనకు ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

'దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తా'

మద్దికెర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో గల ఎలాంటి ఆదాయ వనరులు లేని దేవాలయాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తాననీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ నిర్వహకులు ఎస్.విజయప్రసాద్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దేవాలయాలకు రూ.50వేల విలువ చేసే 300 లీటర్ల దీపం ఆయిల్ ఊదబత్తీలు దేవాలయ నిర్వహకులకు అందజేశారు. అలాగే స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ప్రభుత్వం కూడా దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆలయ పూజారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయ బృందం

మద్దికెర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఏ ప్రాంతానికి వెళ్లినా మంచి పేరు తెచ్చుకోవాలని మండల విద్యాధికారి రంగస్వామి, రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ పారా రవికుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని మండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో పదోన్నతి, బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విశ్వనాథ్, చంద్రశేఖర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

పత్తికొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారానికై పోరాడుదామని ఎస్టీయూ సీనియర్ నాయకులు నాగేంద్రప్ప, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శాంతి టాలెంట్ స్కూల్ ఆవరణలో నూతన మండల కమిటీ సమావేశం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. అనంతరంమండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్‌ఎంపీలకు పారా మెడికల్ శిక్షణ ఇవ్వాలి


ఆర్‌ఎంపీలతో సమావేశమైన డాక్టర్ గోవింద్‌రెడ్డి

దేవనకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలకు ప్రభుత్వం పారా మెడికల్ శిక్షణ ఇవ్వాలని ఆర్‌ఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గోవింద్‌రెడ్డి తెలిపారు. స్థానిక జ్ఞానసుధ పాఠశాలలో మండలంలోని ఆర్‌ఎంపీలతో సమావేశమై మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 429ను తిరిగి అమలు చేయాలన్నారు. ఆర్‌ఎంపీలకు పారా మెడికల్ శిక్షణ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో గుర్తింపు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇస్తే ఆర్‌ఎంపీలుగా చెలామణి అవుతున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. మండల అధ్యక్షులు షఫీ, డీసీ ఖాజావలి, గోవింద్, శేఖన్న పాల్గొన్నారు.

పక్కా గృహాల కోసం వెయ్యి దరఖాస్తులు

మద్దికెర, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల నుంచి పక్కా గృహాలు నిర్మించుకోవడానికి లబ్దిదారుల నుంచి వేయి దరఖాస్తులు వచ్చాయనీ హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని తెలపడంతో ప్రజలు వేయి మంది పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారనీ అన్నారు. అందులో అర్హులను గుర్తించి జాబితా తయారు చేస్తామన్నారు.

నిత్య పూజలు బంద్

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా నిత్య పూజలకు విరామం కల్పించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో రాఘవరాయల నిజ బృందావనానికి నిర్మల విసర్జనం, తులసి అర్చన చేశారు. పూర్ణబోధ పూజా మందిరంలో సంస్థాన పూజ చేశారు.

శ్రీమఠంలో భక్తుల రక్షణకు ప్రాధాన్యం : పీఠాధిపతి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి కొలువై ఉన్న శ్రీమఠంలో భక్తుల రక్షణకు ప్రాధాన్యమిస్తామని శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అన్నారు. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సెలవు రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని శ్రీమఠంలో పీఠాధిపతి పర్యటించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన భక్తుల తొక్కిసలాటలో చాలా మంది మృతి చెందారని, ఇలాంటి ఘటనల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్వామీజీ మఠం సిబ్బందికి సూచించారు. పీఠాధిపతి వెంట మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, హరినాథ్, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, మురళిస్వామి తదితరులు ఉన్నారు.

వైభవంగా హోమాలు


హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో విశ్వశాంతి మహా యాగంలో భాగంగా ఆదివారం ఉదయం నుంచే యాగశాలలో హోమాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి యాగశాలలో పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. సూర్య, సరస్వతి హోమాలు, సూర్య నమస్కారాలు, సాయంత్రం సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ కృష్ణమఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామీజీ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోసిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రలకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యల జోలికి వెళ్లిన వారిపై కఠిన చర్యలు తప్పవని కోసిగిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం కోసిగి పోలీస్‌స్టేషన్ లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాలలో ప్రశాంత వాతవరణంలో అందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. అల్లర్లుకు గొడవలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఏషియన్-2025 ల్యాక్రోస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక


హుస్సేన్ సాబ్

కోసిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న ఏషియన్ -2025 ల్యాక్రోస్ క్రీడలు సౌదీ అరేబియా దేశంలో జరగనున్నాయి. ఈ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ల్యాక్రోస్ జట్టు కెప్టెన్ డి.బెళగల్ హుస్సేన్ సాబ్ ఎంపికయ్యాడు. ఆదివారం హుస్సేన్ సాబ్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22 వరకు ఏషియన్ గేమ్స్-2025 సౌదీ అరేబియా దేశంలో జరగనున్న ల్యాక్రోస్ క్రీడలకు ఇండియా టీమ్ తరుపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తాను పాల్గొంటున్నట్లు తెలిపాడు. అక్కడి వెళ్లి ఆడడానికి రూ.2 లక్షల మేర ఖర్చు అవుతుందని, దాతలు సహకరించాలని కోరాడు. డి.బెళగల్ గ్రామానికి చెందిన బెళగల్ రసూల్‌సాబ్, చాంద్‌బీ దంపతుల కుమారుడు హుశేన్‌సాబ్ ఇప్పటి వరకు ల్యాక్రోస్ క్రీడా పోటీల్లో రాష్ట్రం నుంచి పలు రాష్ట్రాల్లో పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాడు. ఈ నెల 8వ తేదీన ఢిల్లీ నుంచి ఇండియా జట్టు క్రీడాకారులు వెళ్తున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

నందవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నందవరంలో టీడీపీ నాయకుడు డీలర్ నరసింహులు అనారోగ్యంతో బాధపడుతుండడంతో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాధవరావు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్యం బాగు చూసుకోవాలని ఆయనకు సూచించారు. తనవంతు అన్ని రకాలుగా సహకరించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున కూడా ఎమ్మెల్యే బీవీ జయనాశ్వరరెడ్డితో మాట్లాడి ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధి చేకూరుచ్చేలా చూస్తానన్నారు. ఆయన వెంట ఈరన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మల్లి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు కోసిగి విద్యార్థిని


హైమావతికి ప్రశంసా పత్రం, మెడల్ అందజేస్తున్న పీఈటీ

కోసిగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి విలువిద్య క్రీడా పోటీలకు కోసిగి కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న హేమావతి ఎంపికైందని పీఈటీ సుమ, ప్రిన్సిపాల్ షభానా అజ్మీన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో మన్యం జిల్లా పార్వతీపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో జిల్లాల జట్టు నుంచి హేమావతి పాల్గొంటుందని పీఈటీ సుమ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హేమావతిని కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీ సుమ, కోసిగి ప్రజలు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలను నివారించాలి


రాఘవేంద్రరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ రమేశ్‌రెడ్డి

కోసిగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో శాంతి భద్రత లను పరిరక్షించి అసాంఘిక కార్యకలాపాలను నివారించాలని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కోరారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన డి.రమేశ్ రెడ్డి ఆదివారం రాఘవేంద్ర రెడ్డి స్వగ్రామమైన మాధవరం స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. అనంతరం రాఘవేంద్ర రెడ్డి ఎస్ఐ రమేష్ రెడ్డితో మాట్లాడుతూ కోసిగి మండలంలో పార్టీలకతీతంగా పని చేయాలని కోరారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదన్నారు. ఎస్ఐ రమేశ్ రెడ్డిని కోసిగి మండలంలోని పలువురు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఆదివారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో కలిసి శాలువ పూలమాలలతో సన్మానించారు.

చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో అనుమతులు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం వారు మాట్లాడుతూ కొందరు అనుమతులు లేకున్నా కమీషన్ ఏజెంట్లుగా చలామణీ అవుతున్నారని ఆరోపించారు. కార్యదర్శి చంద్రమౌళి అందుబాటులో లేకపోవడంతో అటెండర్ బషీర్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు. రాజు, మహాదేవప్ప, మధుసూదన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు భద్రత కరువు: వైసీపీ



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకే కాదు.. భక్తులకు కూడా భద్రత కరువైందని వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన ఘటనపై వైసీపీ కార్యకర్తలతో కలిసి పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. గడ్డం నారాయణరెడ్డి, ఎంపీపీ కేశన్న, బుట్టా రంగయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటీయు నాయకులు అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో దీర్ఘకాలికంగా ఉద్యమాలు చేస్తున్నా కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాలకులు మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఈ నెల 6వ తేదిన జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు, సల్మాన్, రాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఘనంగా బీవీ జయంతి


నందవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగతనేత మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఆయన తనయుడు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి 76వ జయంతిని నిర్వహించారు. బీవీ చిత్రపటానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి నిస్వార్థ సేవలు అభివృద్ధి రూపంలో కనబడుతూనే ఉంటాయన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, నాయకులు మాచాని మహేశ్, రామకృష్ణ నాయుడు, సుందరరాజు, రంగన్న, కటారి రాజేంద్ర, పార్లపల్లి మల్లికార్జున, నరసింహులు, ప్రతాపరెడ్డి, కౌన్సిలర్లు అమాన్, వాహీద్, విజయలక్ష్మి, సూరి, అబ్దుల్లా, గుల్లా సలీం పాల్గొన్నారు.

నందవరం: దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి జయంతి వేడుకలను ఆదివారం నందవరంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ కాశీంవలి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు కేక్ కట్ చేసి బీవీ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. రైస్‌మిల్ నారాయణరెడ్డి పుష్పావతి, సహకార మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, భార్గవ్‌యాదవ్, చిన్నరాముడు, పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి 76వ జయంతి వేడుకలు ఆదివారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, బేతాల బడేసా, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, మురళీనాయుడు, నజీర్, రెహంతుల్లా, రమణచౌదరి, నూరహమ్మద్, ఫక్రుద్దీన్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, పాల్గొన్నారు.